

# ఋణానుబంధం

— హిమబిందు

"హైదరాబాదులో మా అత్తగారికి చెల్లెలి వరుసైన ఆవిడుంది. అక్కడ వుండి రాస్తున్నది మా అమ్మాయి పరీక్షలు! "ఓ వారం పదిరోజులేకదా?" అంది మా పక్కింటావిడ. వాళ్ళమ్మాయి సుధకి యు.పి.ఎ.స్.సి పరీక్షలు రాయడానికి హాల్‌టికెట్ వచ్చింది. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. ఎక్కడో అత్తగారి చెల్లెలు వరసట! వాళ్ళింట్లో వారం రోజులుంటుందిట. నా కళ్ళముందు గిర్రున మా యిల్లే తిరుగుతుంది ఈ బంధుత్వాల ప్రసక్తివస్తే.

ఇరవై ఏళ్ళక్రితం యింట్లో చెప్పకుండా పారిపోయి ఎయిర్ ఫోర్స్‌కు చేరిన మావయ్య గుర్తువచ్చాడు. ఎక్కడో పంజాబీ ఆవిడని పెళ్ళిచేసుకుని, పెద్ద ఆఫీసరై ఇరవై ఏళ్ళ తర్వాత తెలుగుభాష కూడా దాదాపు మర్చిపోయి, తండ్రిగానీ పోయివుంటే ఆమిగిలిన మూడెకరాలు అమ్మిడబ్బు తీసుకెళ్దామని వచ్చాడు. దురదృష్టవశాత్తూ తాతగారు యింకాపోలేదు. ఎనభైఏళ్ళునిండి, ముసలివగ్గె, మతిభ్రమించి ఒక్కడూ గదిలో వుంటాడు. ఆయన అరుపులు, కేకలు, ధోరణీ అందరికీ అలవాటే! ముసలివాడని ఎవరూ పట్టించుకోరు. అంతమతిలేని స్థితిలో కూడా కూతురి యిల్లు అని మాయింటికిరాని ఆత్మాభిమాని ఆయన! కొడుకుకోసం కలవరించి పిచ్చివాడయ్యాడు.

ఏ విమానం చప్పుడు వినిపించినా "చూశావుటే అమ్మాయి? అదినడిపేది ఎవరనుకున్నావు? నాకొడుకే! మీమావయ్యే! నేను ఎలావున్నానో పై నుంచి రోజూ చూసివెళ్తూంటాడు" అని బోసినోటితో చిన్నపిల్లాడిలా నవ్వుతూంటే గుండెలు నలిపినట్లయ్యేది. ఎంతో అల్లారుముద్దుగా పెంచాడుట పిల్లల్ని! కానీ చండశాసనుడట! ఆయనంటే అమ్మకి మావయ్యకి హడలుట! ఎదుట నుంచోడానికి వణికేవారుట! అమ్మచెప్పేది. ఏదికావల్సినా కాదనేవాడుకాదుట. ఎయిర్‌ఫోర్స్‌లో చేరడానికి వీల్లేదని శాసిస్తే, మావయ్య పారిపోయాడుట యింటి నుండి. ఈ యిరవైఏళ్ళు అతన్ని మేము ఎరగము! మా కష్టం, సుఖం ఎందులోనూ అతను పాలుపంచుకోలేదు. చెల్లెలు ఎలా వుందో, పిల్లలెందరో తెలీదు.

"ఏ రాధాజీకా ఘర్‌హై?" అని అమ్మపోయిన ఐదేళ్ళకి వచ్చి, రెండు రోజులున్న అతని బంధుత్వం తెలిసి, మాయింటికి వచ్చిపోయే ఎందరో అనామకుల్లాగే అతనూ అనిపించాడు. అదే సమయంలో తాతగారు వచ్చారు. ఆయన యిష్టం వచ్చినప్పుడల్లావచ్చి ఓ గంట కూర్చుని వెళ్ళిపోతూంటాడు. టిఫిన్ పెడితే, "పిచ్చిదానా, నాకెందుకే తల్లీ? ఆ అన్నపూర్ణాకేఫ్‌వాడు వద్దంటున్నా వేడి వేడి దోసెలు గారెలు తినిపించాడు." అంటూనే చేతులు కూడా కడుక్కోకుండా ఆవురావురుమని తింటూంటే నాకు అర్థమైపోయేది ఆయన ఏంతినలేదని. అది తింటూ తను యిప్పుడే ఇందిరా గాంధీతో ట్రంకాల్‌లో మాట్లాడానని, ఎవరో మినిస్టరుతో మాట్లాడుతున్నానని చెప్తాడు. అందర్నీ ఉద్యోగంలోంచి పీకించేస్తానంటాడు. వింటూవుంటాను అడ్డుచెప్పకుండా.

లోపలగదిలో 'ఇండియా టుడే' తిరగేస్తూ అతను, బైటహాల్లో తాతగారు! అతను నన్ను చాటుగా పిల్చి "రాణీ! నేను వచ్చినట్లు ముసలాడికి చెప్పకు. నన్నువట్టుకుని వెంటబడతాడు" అన్నాడు. ఇరవైఏళ్ళ తర్వాత తండ్రిని చూస్తున్నవ్యక్తి అతను! వృద్ధుడై చూపుఆనక ముసలితనంలో తోడులేక అతనికోసమే కలవరించిపోతూ జీవితం చివరి అంచుకివచ్చిన తాతగారు! పక్కన గదిలో, చెట్టంతకొడుకు, పెద్ద ఆఫీసరైన కొడుకు! అల్లారుముద్దుగా పెంచిన కొడుకు పలికిన మాటలవి! ఈ దృశ్యంనేను కథల్లోతప్ప చూడలేదు! ఎవరూ నమ్మలేరు కూడా!

అతనికి ఎవరో ఢిల్లీలో తెలిసినవాళ్ళు తండ్రి పోయాడని చెప్తే వచ్చాడు ఆ మూడెకరాలు ఎక్కడపోతాయోనని! తాతగారు "ఈరోజు విమానం రాలేదే అమ్మాయి! బాబుకి ఏం పనితగిలిందోఏమో? వస్తాను. ఈరోజు కుళాయి రాలేదు. కలెక్టర్‌తోమాట్లాడి మునిస్పాలిటీ వాళ్ళపనిపట్టాలి" అనిలేచి, వంగిన నడుముతో, వయోభారంలో చూపు చిట్లించుకుంటూ మెల్లగా బైటకి నడిచాడు. నిన్న వచ్చిన అతను ఈరోజు ఫ్లైట్లో తిరిగి వెళ్తాడు. "ఇడియట్! తెలిసీ తెలీకుండా నాటైము వేస్టుచేశాడు ఆరామంగాడు! వీడుగట్టిపిండం! అప్పుడే ఛావడు. ఛల్ ఘూమేంగే." అని బైటకి నడిచాడు. యింటిబైటకి వచ్చాను. రోడ్డుకి యిటు వైపు పేవ్‌మెంట్ పై సూట్‌తో పైప్‌కాలుస్తూ స్టైల్‌గా మిలటరీ హోదాలో చకచక నడిచిపోతున్న అతను రెండో పేవ్‌మెంట్‌పై, అటువైపు తనలోతాను నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ బిచ్చగాడిలా మాసినగుడ్డలతో మెల్లగా నడుస్తూ, మధ్యలో ఆగి ఎవరినో తిడుతూన్న తాతగారు!... దుఃఖంతో నా మనసు కుంగిపోయింది! మనవాళ్ళు మాట్లాడితే అమెరికాలో వృద్ధాప్యం దశ గురించి జాలి పడుతూ వుంటారు, అంతకన్న దారుణమైన జీవితాలు యిక్కడలేవా? ఎవరికి తెలుస్తుంది?

తర్వాత నెలకో రెండు నెలలకో ఆయన పక్కమీదే మరణిస్తే చుట్టుపక్కలవాళ్ళు వచ్చి చెప్పారు.

మొహం ముడతలువడి బలహీనంగా పీక్కుపోయినా, ప్రశాంతమైన చిరునవ్వుతోవున్న ఆయన మొహం చూసి ఆపుకోలేని దుఃఖంవచ్చింది. కార్లో తిరుగుతూ దర్జాగా కొడుకు చెంత సుఖంగా గడపవలసిన వ్యక్తి ఆయన! ఆ తర్వాత మేము రాసిన ఉత్తరం చూసి వెంటనే వచ్చి, ఆ ఎకరాలు అమ్ముకుని "ఈపోయేదేదో నెల్లాళ్ళ ముందే పోరాదూ? నాకు దారి ఖర్చులు తప్పేవి" అని బాహాటంగా అన్న ఆ వ్యక్తిని చూసి నాకు "తల్లి తండ్రుల యందు దయలేని పుత్రుడు, పుట్టనేమి వాడు గిట్టనేమి? " అనిపించింది. మనది కర్మభూమి! మనం చేసిన పాపాలు యిక్కడే అనుభవించకతప్పదు. దేవుడు అవకాశం అంటూ యిస్తే అతని వృద్ధాప్యం కళ్ళారా చూడాలనివుంది! నా చేతిలో వెళ్తూ ఇరవై రూపాయలనోటు వుదారంగా వుంచాడు.

ఈ ఋణానుబంధం పూర్వజన్మలో కేవలం ఇరవై రూపాయలదే అయివుండాలని నాగట్టినమ్మకం!